క్లుప్తంగా

ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తులు

కోడేరు: మండలంలోని రైతులు ఆయిల్‌పాం సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి లక్ష్మణ్ తెలిపారు. 2023 వానాకాలంలో ఆయిల్‌పాం సాగు చేయాలనుకున్న రైతులు భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, భూమికి సంబంధించిన ఆర్‌ఓఆర్, రైతు పాస్‌ఫొటో సైజు దరఖాస్తు ఫారంతో పాటు మూడు జతల జిరాక్స్ కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సీనియార్టీ ప్రకారం రైతులకు మొక్కలు అందజేస్తామన్నారు. ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ముందుగానే తమ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని సూచించారు.

18న కుడికిళ్లలో ఉద్యాన రైతుల సమావేశం

కొల్లాపూర్: మండల పరిధిలోని కుడికిళ్లలో ఈ నెల 18న ఉద్యాన రైతుల సమావేశం నిర్వహించనున్నట్లు బీడీఎస్ సంస్థ చైర్మన్ సౌమ్య నాయక్ వెల్లడించారు. జీకేఎఫ్, క్లెమ్మేట్రిక్ సంస్థల సహకారంతో కార్బన్ క్రెడిట్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వివరించారు. వాతావరణంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు చెట్లు నాటుతున్న వారి వివరాల సేకరణ, వారికి ప్రోత్సాహకం అందించేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు సంవత్సరాలుగా చెట్ల పెంపకం చేపట్టిన రైతులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు. 18న ఉదయం పెద్దకొత్తపల్లి రైతువేదికలో, మధ్యాహ్నం కుడికిళ్ల రైతువేదికలో సమావేశాలు ఉంటాయని చెప్పారు. మండల రైతులు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

సీఐని కలిసిన గాంధీనగర్ వాసులు

కల్వకుర్తి: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పార్థసారథిని శనివారం గాంధీనగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కలిసి మొక్కను అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐని కలిసిన వారిలో ఎజాస్ అలీ, బాబఖాన్, ఖాదర్, రుక్మద్దీన్, శివప్రసాద్, రమేశ్, రియాజ్ తదితరులు ఉన్నారు.

దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఆర్థికసాయం



కల్వకుర్తి: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి రోడ్డులో నూతనంగా నిర్మాణం చేస్తున్న శివాలయానికి ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.1.50 లక్షల విరాళం శనివారం అందజేశారు. ఈ నిధులతో ఆలయంలో ద్వారపాలకుల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా కమిటీ సభ్యులకు చెక్కును అందజేశారు. కమిటీ సభ్యులు రాజు, రమేశ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బీసీ సంఘం నాయకులు

కల్వకుర్తి రూరల్: గ్రామాల్లో బీసీలను చైతన్యం చేసే కార్యక్రమాలను రాబోయే రోజుల్లో నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా కొందరు తమపై దాడులకు పాల్పడే అవకాశం ఉందని, తమకు రక్షణ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ శనివారం ఎస్పీ మనోహర్‌ను కలిసి వినతి అందజేశారు. కార్యక్రమంలో మహేశ్‌గౌడ్, అరవింద్‌చారీ ఉన్నారు.

కార్యదర్శికి ఘన నివాళి

కల్వకుర్తి రూరల్: ఆత్మహత్య చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి సోనికి శనివారం ఆందోళన శిబిరంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నివాళి అర్పించారు. తమ డిమాండ్లు సాధించాలంటే ఇంకా ఎన్ని ఆత్మ బలిదానాలు కావాలని ప్రశ్నించారు.

తల్లిదండ్రులకు పాదపూజ

తెలకపల్లి: మండల కేంద్రంలోని సిద్ధార్థ మోడల్ పాఠశాలలో శృతిలయ కల్చరల్ అకాడమి సంగీత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ చేశారు. ఆచార్య రమేశ్ గురూజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇలాంటి కార్యక్రమాలతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఎంపీపీ కొమ్ము మధు, యాదయ్య, విజయ్‌గౌడ్, చిత్తరంజన్ దాస్ పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై పోరాడుతాం

కొల్లాపూర్: బీజేపీ విధానాలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ఎండీ ఫయాజ్ వెల్లడించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం ముగింపు సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్రమైన అసహనం ఉందన్నారు. పెరిగిన వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని వివరించారు. తమ పర్యటనలో ఈ విషయాలు తెలిశాయన్నారు. సమావేశంలో తుమ్మల శివుడు, ఇందిర, కురుమయ్య, యూసుఫ్, జంగం శివుడు తదితరులున్నారు.

దళితుల సంక్షేమానికి పెద్దపీట



అంబట్‌పల్లిలో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం మండలంలోని అంబట్‌పల్లిలో నూతనంగా నిర్మించే ఎస్సీ భవన నిర్మాణం కోసం వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితుల అభ్యున్నతికి ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పేదలైన దళితులు స్వయం ఉపాధి పనులు చేపట్టే వీలుగా, అభివృద్ధి చెందేందుకు దళిత బంధు పథకాన్ని అమలు చేస్తుందని, ఒక్కో లబ్ధిదారుడికి రూ. 10 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ మధ్య కాలంలోనే దేశంలో ఎక్కడి లేని విధంగా హైదరాబాద్ నడిబొడ్డులో భారతరత్న అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం, నూతనంగా నిర్మించిన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి దళితుల పక్షపాతి అని వారన్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం తన వంతుగా రూ.10 లక్షలు ఇస్తానని ఎంపీ తెలిపారు. జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన అంబట్‌పల్లిలో దళితులకు కమ్యూనిటీ భవనం నిర్మించడం హర్షనీయమని, దీని నిర్మాణం కోసం రూ. 5లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఓయూ తెలుగు విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ కాసీం, సర్పంచు రవిశంకర్, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి

కల్వకుర్తి రూరల్: రోడ్డు నిర్మాణం పనులు నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు ఆదేశించారు. శనివారం మండలంలోని గుండూరు నుంచి తెల్కపల్లి వరకు కొనసాగుతున్న డబుల్ రోడ్డు నిర్మాణం పనులను ఎంపీ రాములు లింగసానిపల్లి వద్ద పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సూచనలు చేశారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

మండలంలోని గుండూరు సర్పంచ్ కిష్టారెడ్డి తల్లి సుభద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఎంపీ రాములు సుభద్రమ్మకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తెలంగాణ దండోరా పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా డీకే మాదిగ



నియామక పత్రం అందజేస్తున్న రాముమాదిగ

కొల్లాపూర్: తెలంగాణ దండోరా పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా డీకే మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక ఉత్తర్వులను తెలంగాణ దండోరా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాముమాదిగ అందజేశారు. ఈ సందర్భంగా డీకే మాదిగ మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మాదిగల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని వెల్లడించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

కొల్లాపూర్: మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్లమెంట్ పరిధిలోని వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. టీడీపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు పోటీలో ఉంటారని వెల్లడించారు. సమావేశంలో టీటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బక్కని నర్సింహులు, పార్లమెంట్ అధ్యక్షుడు జక్కుల ఐలయ్యయాదవ్, పొగాకు జయరాం, సుధాకర్‌నాయుడు, మోపతయ్య, రాములు, మెట్టుకాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలి

వెల్దండ: ముదిరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శనివారం వెల్దండ మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ముదిరాజ్ సంఘం నాయకులు ఐక్యమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలన్నారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా కొల్లాపూర్‌లో నిర్వహిస్తున్న మినీ మహానాడు కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఆయన్ను మార్గమధ్యలో ఆపి సన్మానించారు. పుట్ట శేఖర్, మల్లేష్, సురేష్, వెంకటయ్య, లింగం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

కోడేరు: మండల కేంద్రంలో చేపడుతున్న వీఓఏల సమ్మె శనివారం 27వ రోజుకు చేరుకుంది. సీఎం కేసీఆర్ తమ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మదన్‌మోహన్, భీమయ్య, నరసింహ, కురుమయ్య, లక్ష్మి అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: సమస్యలు, జీతాల పెంపు, ఉద్యోగ భద్రత ఇతర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని వీఓఏల రాష్ట్ర అధ్యక్షుడు రాజుకుమార్ అన్నారు.

నాయకుల పరామర్శ

లింగాల: మండల పరిధిలోని ఎర్రపెంటకు చెందిన కాట్రాజు లింగస్వామి అనారోగ్యంతో మృతిచెందగా.. శనివారం పలు పార్టీలకు చెందిన నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురాథోడ్ రూ.4 వేల ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు సతీష్‌మాదిగ రూ.5 వేలతో పాటు బియ్యం అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయా పార్టీల నాయకులు భరోసా కల్పించారు.

కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి: మండలంలోని మహదేవునిపేట కేఎల్ఐ కాల్వ బ్రిడ్జి సమీపంలో ప్రమాదవశాత్తు కారు బోల్తా కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్ర చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట నుంచి దేవాచారి, లక్ష్మణాచారి, ఇంద్రజ, వనజ కారులో బుద్ధారం ప్రయాణిస్తుండగా ప్రమాదశావత్తు స్థానిక కాల్వ సమీపంలో బోల్తా కొట్టింది. అందులో ఇంద్రజ, వనజ, లక్ష్మణాచారిలకు తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా, అటుగా వెళ్తున్న వారు అంబులెన్స్‌లో చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి అదృశ్యం

ఉప్పునుంతల: మండలంలోని పెనిమిళ్లకు చెందిన పర్తం చిన్న గత నెల 26 నుంచి కనిపించడం లేదని తండ్రి పర్తం రాములు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఆరోజు ఉదయం తన అత్తగారి ఊరైన దేవరకొండకు వెళ్తున్నాని చెప్పి, ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు అక్కడకు వెళ్లలేదన్నారు. దీంతో పరిసర గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలియజేశారు.

ఆర్థిక సాయం అందజేత



పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల జెడ్పీహై స్కూల్‌లో 2000 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పార్వతి కుమార్తె శ్రీజ పెళ్లికి స్నేహితులందరూ కలిసి రూ.30 వేలు సేకరించి శనివారం పతానం కార్యక్రమంలో పార్వతికి అందజేశారు. శివలీల, రాధిక, భాగ్యమ్మ, సలేశ్వరం, శ్రీను, శివుడు పాల్గొన్నారు.

తర్నికల్‌లో..

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మృతుడి కుటుంబానికి సురేష్ గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు.

బీమా చెక్కు..

చారకొండ: మండలంలోని తుర్కలపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళ కార్యకర్త ఇటీవల ప్రమాదంలో మృతిచెందింది. ఆమె కాంగ్రెస్ పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకోవడంతో రాజీవ్ గాంధీ బీమా పథకంలో భాగంగా రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ బాధిత కుటుంబానికి అందజేశారు.

రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

చారకొండ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం వంశీకృష్ణ విలేకరులతో మాట్లాడారు. దేశంలో రాహుల్‌గాంధీ, రాష్ట్రంలో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసాన్ని పొందారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని అన్నారు. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని విమర్శించారు. దళితబంధుపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వెంకట్‌గౌడ్, బాల్‌రాంగౌడ్, నర్సింహా రెడ్డి ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే..

ఉప్పునుంతల: కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం నిర్వహించిన విజయోత్సవ సంబురాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి ప్రారంభించిన జోడో యాత్రతో ప్రజల ఆలోచనలో పెనుమార్పులు వచ్చాయన్నారు. మార్పు సారాంశమే నేడు కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు అన్నారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. కట్టా అనంతరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, షణ్ముకారెడ్డి, రేణయ్య, కృష్ణనాయక్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల గుర్తింపును రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తారాసింగ్

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వమే పెట్టుబడిగా మద్దతు ఉంటూ.. ప్రభుత్వరంగ విద్యాసంస్థలను కనుమరుగయ్యేలా వ్యవహరిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు తమ సత్తాను చాటుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ఎక్కడా వారి ప్రతిభను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల బోర్డింగులు, ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేశ్, కార్తీక్, రామకృష్ణ, చైతన్య, మహేశ్, వంశీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమం

తెలకపల్లి: బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతు సంఘం శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. శిబిరాలకు విరివిగా విరాళాలు అందజేయాలని, శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయానికి అనుకూలంగా అన్ని రకాల వసతులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. చిలుక బాల్‌రెడ్డి, గోపస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు కార్మికుల మద్దతు



నాగర్‌కర్నూల్‌లో మద్దతు తెలిపిన రామయ్య



తెలకపల్లిలో..

తెలకపల్లి: మండల కేంద్రంలో శనివారం తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సాధారణ సమావేశాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో మండల యూనియన్ అధ్యక్షుడు ఎండి సైదులు, కార్యదర్శి లింగస్వామి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. లక్ష్మయ్య, మైసమ్మ, అలివేల, పార్వతమ్మ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు మానుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 16 రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం విధుల్లో చేరాలని, లేకుంటే ఉద్యోగాలు తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం సరైంది కాదని సీఐటీయూ సహాయ కార్యదర్శి పొదిల రామయ్య అన్నారు. శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. వెంటనే వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నీటిని వృథా చేస్తే చర్యలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి అందించే తాగునీటిని వృథా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అక్షిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగు నీటిని ఇంటి అవసరాలకు మాత్రమే వినియోగించాలన్నారు. ఇతర అవసరాలకు, గృహ నిర్మాణాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

బిజినేపల్లి: 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి తీర్మానం కాపీ కోసం మండలంలోని వెల్గొండకి చెందిన ఉపసర్పంచ్ నాగేష్ ఆ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పరశురాముల్ని రూ.2 లక్షలు డిమాండ్ చేశాడని శనివారం బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు



జిల్లా కేంద్రంలో టపాసులు పేల్చుతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు మిన్నంటాయి. టపాకాయలు కాల్చి, స్వీట్స్ పంచి వేడుకలు చేసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్థం రవి మాట్లాడుతూ.. కర్ణాటకలో నిరంకుశ పాలన ఓడి ప్రజాస్వామ్యం గెలిచిందని, రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పాండు, కోటయ్య, లక్ష్మయ్య, కౌన్సిలర్లు, ఎండి నిజాముద్దీన్, సురేంద్ర, సుల్తాన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

- కొల్లాపూర్ పట్టణంలో చింతలపల్లి జగదీశ్వర్‌రావు అనుచరులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చారు. రంగినేని జగదీశ్వరుడు, రాముయాదవ్, పరశురామ్‌నాయుడు తదితరులున్నారు.
- అచ్చంపేట అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంచి పెట్టారు. వై. శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, రామనాథం, శేఖర్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.
- కల్వకుర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. విజయ్‌కుమార్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.
- మన్ననూర్‌లో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ కూడలిలో బాణాసంచా కాల్చారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు స్వీట్లు పంచుకున్నారు. ఎంఏ రహీం, మేరాజ్, హీర్యానాయక్, శివాజీ, బాలస్వామి, గెలువయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
- పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు స్వీట్లు పంచుకుని టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించుకున్నారు. నర్సింహయాదవ్, గోవు రాజు, నర్సింహనాయుడు పాల్గొన్నారు.
- ఊర్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. తిరుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.
- తాడూరు మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. బాలగౌడ్, శ్రీశైలం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- తెలకపల్లి మండల కేంద్రం నెహ్రూ చౌరస్తాలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయులు, రాముడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.
- అమ్రాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించుకున్నారు. నాయకులు హరినరాయణగౌడ్, వెంకటయ్య, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.
- వెల్దండ మండల కేంద్రంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై బాణాసంచా కాల్చి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మట్ట వెంకటయ్యగౌడు, చంద్రమోహన్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.
- లింగాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నాగేశ్వర్‌రావు, శ్రీనివాసులు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.
- బిజినేపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి నినాదాలు చేశారు. కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి, మిద్దెరాములు, పాష తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో టపాసులు కాలుస్తూ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

–'సాక్షి' నెట్‌వర్క్

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి పండుగ



రాకొండలో పూజలు చేస్తున్న భక్తులు



దప్పుచప్పుళ్ల మధ్యన కళాకారుల విన్యాసాలు

తెలకపల్లి: మండల పరిధిలోని రాకొండలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. రెండు రోజులుగా గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో, వివిధ వేషధారణతో కళాకారులతో పాటు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్‌లో వైభవంగా..

బల్మూర్: మండల కేంద్రంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠాపన చేసిన బొడ్రాయి వద్ద ఆడపడుచులు పూజలు నిర్వహించగా.. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో ఊరేగింపు, మైసమ్మ దేవతకు నైవేద్య సమర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఆలయ కమిటీ బాధ్యులు

భలాన్‌పల్లిలో వీరనాగమ్మ ఉత్సవాలు

తాడూరు: మండలంలోని భలాన్‌పల్లిలో శనివారం వీరనాగమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మరే రకమైన ఆటంకాలు కలుగకుండా గ్రామదేవతలు గ్రామాన్ని కాపాడుతాయన్నారు. నాగయ్య, ఎల్లయ్య, లక్ష్మయ్య, బాలగౌడ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి రోడ్డులో భీమేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాత శివాలయాన్ని తొలగించి భీమేశ్వర శివాలయంగా నిర్మాణం చేశారు. 15వ తేదీ నుంచి 3 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆలయంలో ఆంజనేయ స్వామి, గణపతి, సుబ్రహ్మణ్య నవగ్రహాలు, పార్వతీదేవి, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన చేయనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం చేయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.